• మైక్రో, నానో ప్లాస్టిక్‌తో గుండెపోటు!

లండన్: మైక్రో, నానో ప్లాస్టిక్ మనుషుల ఆరోగ్యానికి పెనుముప్పుగా మారుతున్నాయి. శరీరంలోకి చేరుతున్న మైక్రో, నానో ప్లాస్టిక్ వల్ల గుండెపోటు, క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని ఇటలీకి పరిశోధకులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురితమయ్యాయి. కరోటిడ్ ఆర్టెరీల్లో(మెదడుకు రక్త సరఫరా చేసేందుకు మెడకు ఇరువైపులా ఉండే ధమనులు) నానో ప్లాస్టిక్స్ ఉన్న వారిలో గుండెపోటు వచ్చే ముప్పు ఇతరుల కంటే రెట్టింపు అవుతున్నట్టు వీరు తేల్చారు. కరోటిడ్ ఆర్టెరీలను చెడు కొలెస్టాల్ బ్లాక్ చేసినట్టుగానే నానో ప్లాస్టిక్స్ వల్ల కూడా జరుగుతుందని పేర్కొన్నారు. కరోటిడ్ ఎండార్టెరెక్టోమీ చేసి తొలగించిన 257 మంది కరోటిడ్ అర్టెరీలపై అధ్యయనం జరిపిన పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. మనుషుల జబ్బులకు, ప్లాస్టిక్‌కు సంబంధముందని గుర్తించిన మొదటి అధ్యయనం ఇదేనని, గుండెసంబంధ సమస్యలకు ప్లాస్టిక్ కారణమని తమ అధ్యయనంలో గుర్తించినట్టు ప్రొఫెసర్ రఫేలె మార్చెల్లా తెలిపారు. 0.2 ఇంచుల నుంచి ఒక ఇంచులో 25,000వ వంతు వరకు పరిణామంలో ఉండే ప్లాస్టిక్ శకలాలను మైక్రో ప్లాస్టిక్‌గా పరిగణిస్తారు. ఇంతకంటే చిన్నగా ఉంటే ప్లాస్టిక్ శకలాలను నానో ప్లాస్టిక్‌గా పిలుస్తారు.

• 93 ఏండ్ల వయసులో ఆరో పెండ్లి!

వాషింగ్టన్, మార్చి 8: మీడియా టైకూన్‌గా పేరుగాంచిన 93 ఏండ్ల రూపర్ట్ మర్డోక్ ఆరో సారి పెండ్లి చేసుకోబోతున్నాడు. 67 ఏండ్ల ఎలెనా జుకోవాతో నిశ్చితార్థం చేసుకున్న మర్డోక్.. కాలిఫోర్నియా వైన్ యార్డ్ ఎస్టేట్‌లోని మొరాగాలో జూన్‌లో పెళ్లికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. గతేడాది కూడా మర్డోక్ రేడియో హోస్ట్ ఆన్‌లెస్లీ స్మిత్‌ను(ఐదో భార్య) వివాహం చేసుకున్నాడు. కానీ వీరి వివాహ బంధం నెల రోజుల కన్నా ఎక్కువ కాలం సాగలేదు.

ఎలెనా జుకోవా ఎవరు?

జుకోవా రష్యాకు చెందిన రిటైర్డ్ మాలిక్యులర్ బయాలజిస్ట్. మధుమేహం పరిశోధనలో స్పెషలిస్ట్. 1991లో మాస్కో నుంచి అమెరికాకు వెళ్లారు. మర్డోక్‌కు తన మూడో మాజీ భార్య డెంగ్ ఏర్పాటు చేసిన ఓ పార్టీలో జుకోవాతో పరిచయం ఏర్పడిందట. డెంగ్‌కు 2013లోనే మర్డోక్ విడాకులు ఇచ్చేశాడు. జుకోవా గతంలో రెండు సార్లు రష్యన్ అయిల్ బిలియనీర్ అలెగ్జాండర్ జుకోవ్‌తో పెండ్లి చేసుకున్నది. వారిద్దరికి ఓ కూతురు కూడా ఉన్నది. రూపర్ట్ మర్డోక్ నాల్గవ భార్య సూపర్ మోడల్ జెర్రీ హాల్. ఈమెకు 2022లో విడాకులు ఇచ్చాడు. మర్డోక్‌కు మొత్తం ఆరుగురు సంతానం ఉన్నారు.

• విమానం గాల్లో ఉండగా ఊడిన టైరు!

లాస్ ఏంజెల్స్, మార్చి 8: బోయింగ్ విమానాలు తరచూ మొరాయిస్తూ ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలో గాల్లోకి ఎగిరిన విమానం అత్యవసర ద్వారం ఊడిపోగా తాజాగా టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే మరో విమానానికి చక్రం ఊడిపోయింది. గురువారం శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో ఈ ఘటన జరిగింది. జపాన్ వెళ్లాల్సిన బోయింగ్ 777 జెట్ లైనర్ గాల్లోకి ఎగిరిన కొన్ని సెకన్లకే విమాన చక్రం ఊడిపోయింది. అది కాస్తా విమానాశ్రయ ఉద్యోగుల కారు పార్కింగ్ కోసం ఉపయోగించే స్థలంపై పడటంతో ఒక కారు ధ్వంసమైంది. ఈ ఘటన జరిగిన సమయంలో విమానంలో 249 మంది ప్రయాణిస్తున్నారు. హఠాత్తుగా చక్రం ఊడిపోవడంతో విమానాన్ని అత్యవసరంగా లాస్ ఏంజెల్స్ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

సారీ నాన్నా.. జేఈఈ నా వల్ల కాదు

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా, మార్చి 8: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. జేఈఈ పరీక్షకు సిద్ధమవుతున్న 16 ఏండ్ల అభిషేక్ మండల్ గురువారం రాత్రి పేయింగ్ గెస్ట్ రూమ్‌లో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బీహార్ భాగల్‌పూర్‌కు చెందిన అభిషేక్ తన తండ్రిని ఉద్దేశించి రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'నాన్నా.. జేఈఈ పరీక్షల్లో విజయం సాధించలేను.. క్షమించండి.. నేను వెళ్లిపోతున్నాను' అని అందులో రాసినట్టు డీఎస్పీ ధర్మవీర్ సింగ్ తెలిపారు. జనవరి నుంచి కోటాలో ఐదుగురు ఆత్మహత్య చేసుకొన్నారు.

39 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

వయనాడ్ నుంచే లోక్‌సభకు రాహుల్ పోటీ
తెలంగాణలో 4 స్థానాలకు ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 8: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ శుక్రవారం తొలి జాబితా విడుదల చేసింది. 39 మంది అభ్యర్థుల పేర్లను ఆ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తన సిట్టింగ్ స్థానమైన కేరళలోని వాయనాడ్ నుంచే పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తన మొదటి జాబితాలో సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్(కేరళలోని అలప్పుజ), శశిథరూర్(తిరువనంతపురం)కు చోటు కల్పించింది. ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్‌ను ఆ రాష్ట్రంలోని రాజ్ నందగావ్ నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దింపుతున్నది. తొలి జాబితాలో భాగంగా తెలంగాణలోని నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది.

60 స్థానాలపై చర్చలు

11 రాష్ట్రాల్లోని 60 లోక్‌సభ స్థానాలపై గురువారం సుదీర్ఘంగా చర్చలు జరిపిన కాంగ్రెస్ అధిష్ఠానం.. చివరకు 39 మంది అభ్యర్థులతో మొదటి లిస్టును విడుదల చేయడం గమనార్హం. తొలి లిస్టులో 28 సీట్లు దక్షిణాది రాష్ట్రాలకు చెందినవే కావడం గమనార్హం. అందులో కేరళలో 16, కర్ణాటకలో 7 సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు.

ఐటీ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, మార్చి 8: ఆదాయ పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. గత సంవత్సరాలకు సంబంధించి ఐటీ రిటర్న్స్‌లో వ్యత్యాసాలకు గానూ ఐటీ శాఖ ఇటీవల విధించిన రూ.210 కోట్ల జరిమానాకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వేసిన పిటిషన్‌ను ట్రిబ్యునల్ శుక్రవారం తిరస్కరించింది. ఈ నేపథ్యంలో అతి త్వరలో హైకోర్టును ఆశ్రయించే అంశంపై కూడా పరిశీలన చేస్తున్నామని ఆ పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ పేర్కొన్నారు. ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నదని ఆరోపించారు. పార్టీకి చెందిన దాదాపు రూ.270 కోట్ల ఫండ్స్‌ను ఐటీ అధికారులు స్తంభింపజేశారని పేర్కొన్నారు.

రాజ్యసభకు సుధామూర్తి నామినేట్ చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 8 : సమాజ సేవకురాలు, రచయిత్రి సుధామూర్తిని రాజ్యసభ ఎంపీగా రాష్ట్రపతి ముర్ము శుక్రవారం నామినేట్ చేశారు. వివిధ రంగాల్లో ఆమె చేసిన సేవలను ప్రధాని మోదీ కొనియాడారు. ఎగువ సభలో సుధామూర్తి ఉనికి నారీశక్తికి బలమైన నిదర్శనమని ఎక్స్‌లో స్పందించారు. సుధామూర్తి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి భార్య. మూర్తి ట్రస్ట్ చైర్‌పర్సన్ కూడా అయిన సుధామూర్తి ఎన్నో పుస్తకాలు రచించారు. 73 ఏండ్ల సుధామూర్తిని 2006లో పద్మశ్రీ, 2023లో పద్మభూషణ్ అవార్డులు వరించాయి.

ఉమెన్స్ డే నాడు డబుల్ సర్‌ప్రైజ్

మహిళా దినోత్సవం రోజున తనను రాజ్యసభకు నామినేట్ చేయటం రెట్టింపు ఆశ్చర్యాన్ని కలిగించిందని సుధామూర్తి తెలిపారు. ఈ అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యత తనకు పూర్తిగా కొత్తదని, దీని గురించి ముందు తెలుసుకోవాలని అన్నారు.

సిలిండర్‌పై రూ.100 తగ్గింపు

లోక్‌సభ ఎన్నికల వేళ కేంద్రం నిర్ణయం

- నారీశక్తికి ప్రయోజనం: మోదీ
- ఎన్నికల స్టంట్ అన్న విపక్షాలు

న్యూఢిల్లీ, మార్చి 8: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరను తగ్గించింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్‌పై రూ.100 తగ్గిస్తున్నట్టు ప్రధాని మోదీ శుక్రవారం ప్రకటించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నదని ఆయన పేర్కొన్నారు. 'సిలిండర్ ధర తగ్గింపుతో దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుంది. ముఖ్యంగా 'నారీశక్తి'కి ప్రయోజనం చేకూరుస్తుంది' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. వంట గ్యాస్ ధర తగ్గింపు నిర్ణయం శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు. తాజా తగ్గింపుతో దేశ రాజధాని ఢిల్లీలో 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.803 ఉంటుందని పేర్కొన్నారు. ఉజ్వల స్కీమ్ లబ్ధిదారులు రూ.300 రాయితీతో ఇప్పుడు సిలిండర్‌ను కేవలం రూ.503కే పొందుతారని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. రాష్ట్రాల్లో స్థానిక పన్నుల ఆధారంగా సిలిండర్ ధరలో మార్పు ఉంటుంది. అయితే సిలిండర్ ధరను తగ్గించిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పటికే ఆకాశాన్నంటిన పెట్రోల్, డీజిల్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

గతంలోనూ ఎన్నికల ముందర..

సరిగ్గా ఎన్నికల సమయంలోనే కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరను తగ్గిస్తూ మరోసారి నిర్ణయం తీసుకోవడం గమనార్హం. గత ఆరు నెలల్లో వంట గ్యాస్ ధరను తగ్గించడం ఇది రెండోసారి. గత ఏడాది ఆగస్టులో సరిగ్గా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.200 తగ్గించిన విషయం తెలిసిందే. అప్పటికే ఎల్పీజీ సిలిండర్ ధరలు తొమ్మిదేండ్ల గరిష్ఠానికి చేరాయి. ఆ సమయంలో చేపట్టిన సవరణతో సిలిండర్ ధర రూ.1,103 నుంచి రూ.903కి తగ్గింది. కాగా, లోక్‌సభ ఎన్నికల భయంతోనే సిలిండర్ ధరను కేంద్రం తగ్గించిందని, ఇదొక చౌకబారు పొలిటికల్ స్టంట్ అని టీఎంసీ విమర్శించింది. మోదీ చేసే నారీ శక్తి ప్రచారం కేవలం ఎన్నికల వరకే పరిమితం అవుతుందని ఎంపీ సాగరిక ఘోష్ అన్నారు.

అధిక వేతనాల ఆశ చూపి..

రష్యా సైన్యంలోకి భారత యువతను చేరుస్తున్న ఏజెంట్లపై చర్యలు తప్పవు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 8: రష్యాలో ఉద్యోగాల పేరిట కొందరు ఏజెంట్లు భారతీయులను తీసుకువెళ్లి రష్యా ఆర్మీలో సహాయ సిబ్బందిగా చేరుస్తున్నారని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించామని, వెంటనే వారిని వదిలిపెట్టాలంటూ మాస్కో దృష్టికి తీసుకు వెళ్లినట్టు పేర్కొన్నది. అధిక జీతాలతో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భారతీయులను మోసం చేసి తీసుకెళ్లిన ఏజెంట్లు, వీసా కన్సల్టెంట్లు, ఇతర సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. సపోర్టింగ్ స్టాఫ్‌గా ఆర్మీలో చేరిన భారతీయులను సాధ్యమైనంత త్వరగా వెనక్కి రప్పించడానికి పూర్తి అంకిత భావంతో కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఏజెంట్ల చేతిలో మోసపోయి రష్యా ఆర్మీలో చేరిన హైదరాబాదీ ఉక్రెయిన్‌తో యుద్ధంలో ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. భారతీయులను మోసం చేసిన ఏజెంట్లు, ఇతరులపై సీబీఐ గురువారం దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించి పలువురిని అరెస్ట్ చేసింది.

ఏటా 3 సార్లు ఐసీఏఐ పరీక్షలు

న్యూఢిల్లీ: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇకపై ఏటా మూడుసార్లు ఫౌండేషన్, ఇంటర్మీడియెట్ కోర్సుల పరీక్షలను నిర్వహించనుంది. ఈ నెల 7న ఈ నిర్ణయం తీసుకొన్నారు. ఇప్పటివరకు ఏటా రెండుసార్లు మాత్రమే పరీక్షలు నిర్వహించేవారు. 'ఇంటర్మీడియెట్, ఫౌండేషన్ కోర్సులను జనవరి, మే/జూన్, సెప్టెంబర్‌లలో నిర్వహించనున్నాం' అని ఐసీఏఐ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

కర్ణాటకలో ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీలపై నిషేధం

బెంగళూరు, మార్చి 8: కర్ణాటక ప్రభుత్వం విద్యుత్తు బైక్ ట్యాక్సీ సేవలపై ఈ నెల 6 నుంచి నిషేధం విధించింది. మోటార్ వాహనాల చట్టం నిబంధనలు ఉల్లంఘనకు గురవుతున్నాయని రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. 'కొన్ని ప్రైవేట్ యాప్ ఆధారిత కంపెనీలు మోటార్ వాహనాల చట్టాన్ని ఉల్లంఘించి ద్విచక్ర వాహనాలను రవాణా వాహనాలుగా చూపిస్తున్నాయి' అని ప్రభుత్వం పేర్కొంది. తరచూ ఆటోరిక్షాల యజమానులు, డ్రైవర్లతో 'మ్యాక్సీ క్యాబ్స్' డ్రైవర్లకు గొడవలు జరిగి కేసులు నమోదవుతున్నాయని తెలిపింది. బైక్ ట్యాక్సీల వల్ల రవాణా శాఖకు పన్ను ఏకరణ కష్టంగా మారిందని చెప్పింది. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలు, మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

మణిపూర్‌లో ఆర్మీ అధికారి కిడ్నాప్

ఏడాదిలో ఇది నాలుగో ఘటన

ఇంఫాల్: మణిపూర్‌లో ఓ ఆర్మీ అధికారిని గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేశారు. తౌబాల్ జిల్లాకు చెందిన ఆర్మీ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ కొన్సం ఖేడా సింగ్ తన ఇంట్లో ఉండగా శుక్రవారం ఉదయం కొందరు కిడ్నాప్ చేసి వాహనంలో తీసుకెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన భద్రతా బలగాలు ఖేడా సింగ్‌ను సాయంత్రానికి కాపాడాయి. కాగా, మణిపూర్‌లో గత ఏడాది మే నెలలో రెండు వర్గాల మధ్య హింస మొదలైన నాటి నుంచి మిలిటెంట్లు.. పోలీసులు, సైనికులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. గత సెప్టెంబర్‌లో అస్సాం రెజిమెంట్ మాజీ సైనికుడు సెర్టో ఢాంగ్‌ఢాంగ్ కోమ్‌ను కిడ్నాప్ చేసి హత్య చేశారు. రెండు నెలల తర్వాత జమ్ము కశ్మీర్‌లో పని చేసే ఓ సైనికుడి నలుగురు కుటుంబ భ్యులపై దాడి చేసి హతమార్చారు. ఫిబ్రవరి 27న మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో ఒక అడిషనల్ ఎస్పీని కూడా కిడ్నాప్ చేశారు. సైనికులు, పోలీసులు ఇంటి దగ్గర ఉన్నప్పుడే మిలిటెంట్లు లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది.

నీరు వృథా చేస్తే ఫైన్

- బెంగళూరులో తీవ్రంగా నీటి ఎద్దడి
- వాహనాలు కడిగేందుకు, నిర్మాణ పనులకు తాగునీటిని వాడొద్దు
- ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా
- నగరవాసులకు జలమండలి హెచ్చరిక

బెంగళూరులోని భారతీనగర్‌లో నీళ్ల కోసం సినీ నటి తార తదితరుల ధర్నా

బెంగళూరు, మార్చి 8: కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని బెంగళూరు నగరం తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నది. తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అటు నగర జలమండలి సరిపడా నీరు సరఫరా చేయకపోవడంతో పాటు మరోవైపు బోర్లు కూడా ఎండిపోతున్న నేపథ్యంలో ప్రజలు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితిని నెలకొన్నది. నీటి కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో బెంగళూరు నీటి సరఫరా బోర్డు తాజాగా కీలక నిర్ణయం తీసుకొన్నది. తాగునీటిని వృథా చేయొద్దని ప్రజలను కోరింది. ఉల్లంఘనకు పాల్పడితే రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని అవసరాల మేరకు వినియోగించాలని సూచించింది. తాగునీటిని వాహనాలను తుడిచేందుకు, నిర్మాణం, వినోద కార్యక్రమాల్లో వాడొద్దని, అదేవిధంగా సినిమా హాళ్లు, మాల్స్‌లో తాగునీటి అవసరాల మినహా ఇతరత్రా కోసం వినియోగించవద్దని స్పష్టం చేసింది. ఉల్లంఘనకు పాల్పడిన వారిపై మొదటగా రూ.5 వేలు జరిమానా పడుతుందని, పదేపదే నీటి వృథాతో ఉల్లంఘనకు పాల్పడితే అదనంగా ప్రతిసారి రూ.500 చొప్పున ఫైన్‌గా చెల్లించాల్సి ఉంటుందని బెంగళూరు జలమండలి హెచ్చరించింది.

అవసరంలో సగం కూడా లేని సరఫరా

నగరంలో రోజుకు 2,600-2,800 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉంటే ఇప్పుడు దాదాపుగా 1,300 ఎంఎల్‌డీ నీరు మాత్రమే సరఫరా అవుతున్నది. అంటే, అవసరమైన నీటిలో సగం కూడా సరఫరా జరగడం లేదు. మరోవైపు ఎండాకాలం ఇంకా పూర్తిగా ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోవు రోజుల్లో పరిస్థితి ఇంకా ఎంత స్థాయికి దిగజారుతుందోనని నగరవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఒక్క బెంగళూరు మాత్రమే కాదు.. తుమకూరు, ఉత్తర కన్నడ జిల్లాల్లోని పలు ప్రాంతాలోనూ నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నదని రెవెన్యూ శాఖ గుర్తించింది.

నైజీరియాలో 287 మంది విద్యార్థుల కిడ్నాప్

అబుజా: పశ్చిమాఫ్రికాలోని నైజీరియాలో సాయుధులు గురువారం ఓ పాఠశాలపై దాడి చేసి, 287 మంది విద్యార్థులను కిడ్నాప్ చేశారు. కడున స్టేట్‌లోని కురిగ టౌన్‌లో ఈ దారుణం జరిగింది. ఈ అపహరణకు బాధ్యత తమదేనని ఇప్పటి వరకు ఎవరూ ప్రకటించలేదు. కడున గవర్నర్ ఉబ సాని ఈ పాఠశాలను సందర్శించి, ప్రజలకు సంఘీభావం తెలిపారు. అపహరణకు గురైన ప్రతి స్టూడెంట్‌ను తిరిగి తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. నైజీరియా ఉత్తర ప్రాంతంలోని పాఠశాలలపై సాయుధులు తరచూ దాడులు చేస్తూ, పెద్ద ఎత్తున అపహరణలకు పాల్పడుతూ, భారీగా సొమ్మును వసూలు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే సుమారు 200 మందిని అపహరించారు. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. నైజీరియాలో భద్రత దిగజారుతున్నదనడానికి ఈ రెండు సంఘటనలు ఉదాహరణలని పరిశీలకులు చెప్తున్నారు. బోలా టినుబు గత ఏడాది జరిగిన నైజీరియా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారని, హింసకు తెర దించుతానని హామీ ఇచ్చారని, ఇప్పటికీ పరిస్థితులు మెరుగుపడలేదని ఆరోపిస్తున్నారు.

యతీంద్రతో ముద్దుబిరహుండి గ్రామస్థుల వాగ్వాదం

ఊర్లోకి రావొద్దు!

- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కుమారుడికి చేదు అనుభవం
- గ్రామంలోకి రానివ్వకుండా యతీంద్రను అడ్డుకొన్న ప్రజలు
- రోడ్డు పనుల పెండింగ్‌పై నిరసన

మైసూర్, మార్చి 8: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సొంత నియోజకవర్గమైన వరుణలో ఆయన కుమారుడు యతీంద్రకు చేదు అనుభవం ఎదురైంది. గ్రీవెన్స్ మీటింగ్ నిమిత్తం ముద్దుబిరహుండి గ్రామానికి వెళ్లిన యతీంద్రను స్థానికులు అడ్డుకొన్నారు. గ్రామంలోకి రానివ్వకుండా ఘెరావ్ చేశారు. గ్రామంలో గత కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వరుణ నియోజకవర్గానికి 2018-23 టర్మ్‌లో ఎమ్మెల్యేగా చేసిన యతీంద్రకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వారి మధ్య తోపులాట కూడా చోటుచేసుకొన్నది. పరిస్థితిని శాంతింపజేయడానికి పోలీసులు ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. గత ప్రభుత్వ హయాంతోపాటు ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా తమ గ్రామాన్ని పట్టించుకోకపోవడంపై ప్రజలు యతీంద్రపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కంటెంట్ క్రియేటర్లు భారత ఘనతను చాటాలి: మోదీ

న్యూఢిల్లీ: భారత దేశ సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. మన దేశం గురించి సృజనాత్మకంగా ప్రపంచానికి తెలియజెప్పే ఉద్యమాన్ని ప్రారంభించాలని కోరారు. నేషనల్ క్రియేటర్స్ అవార్డ్స్‌ను న్యూఢిల్లీలో ప్రదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ పురస్కారాలను అందుకున్నవారిలో పంకై పాండే, కీర్తిక గోవింద స్వామి, గాయని మైథిలి ఠాకూర్, గౌరవ్ చౌదరి (టెక్ క్యాటగిరీలో బెస్ట్ క్రియేటర్), కామియా జాని ఉన్నారు.

ఆ మెసేజ్ ఫేక్: ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ప్రకటనపై ఎన్నికల సంఘం స్పందించింది. అది ఫేక్ మెసేజ్ అని స్పష్టంచేసింది. ఈ నెల 12 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఈసీ పేరిట కొందరు నకిలీ వార్తను ప్రచారం చేస్తున్నారు. మార్చి 28 నుంచి నామినేషన్లు, ఏప్రిల్ 19న పోలింగ్, మే 22న ఫలితాలు ప్రకటిస్తారని అందులో ఉన్నది. అయితే ఇది ఫేక్ అని, తాము ఎలాంటి షెడ్యూల్ ప్రకటించలేదని ఈసీ స్పష్టంచేసింది.

వరి వదిలేస్తే ప్రోత్సాహం

- ప్రత్యామ్నాయ పంటలకు ఎంఎస్పీ
- పప్పలు, మక్కజొన్న, పత్తికి వర్తింపు
- కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదన

ప్రతిపాదన తిరస్కరించిన రైతు సంఘాలు

న్యూఢిల్లీ, మార్చి 8: నీరు ఎక్కువగా అవసరమయ్యే వరి పంట నుంచి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించడానికి కేంద్రం కొత్త ప్రణాళికను అమలు చేయనున్నట్టు తెలుస్తున్నది. రైతులు వరికి బదులుగా కంది, మినుము, ఎర్ర పప్పు, మక్కజొన్న, పత్తి పంటలు పండిస్తే ఐదేండ్ల పాటు కనీస మద్దతు ధర ఇచ్చి పంటను కొనుగోలు చేయనుంది. కేంద్ర సంస్థలైన జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య(ఎన్సీసీఎఫ్), జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్) రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకుంటాయి. ఇందుకు గానూ ప్రభుత్వం ఒక పోర్టల్‌ను ప్రారంభించనుంది. ఈ పోర్టల్‌లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. వరికి బదులుగా ఇతర పంటలు పండించే రైతుల నుంచి ఎలాంటి పరిమితులు లేకుండా కనీస మద్దతు ధర ఇచ్చి పంట కొనుగోలు చేయాలని కేంద్రం భావిస్తున్నది.

ఒడిశాలో ఒంటరి పోరే: బీజేపీ

భువనేశ్వర్, మార్చి 8: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాలో బీజేపీది ఒంటరి పోరే నని ఆ పార్టీ రాష్ట్ర చీఫ్ మన్మోహన్ సమాల్ తేల్చి చెప్పారు. అధికార బీజేడీతో పొత్తుపై పార్టీ అధినాయకత్వంతో జరిగిన చర్చల్లో ఎలాంటి ప్రస్తావన రాలేదని ఆయన స్పష్టంచేశారు. 2009లో సీట్ల పంపకాల విషయంలో విభేదాలతో బీజేపీతో బీజేడీ విడిపోయింది. ఇటీవల బీజేపీతో బీజేడీ పొత్తు ఉంటుందన్న ఊహాగానాల నేపథ్యంలో శుక్రవారం బీజేపీ రాష్ట్ర చీఫ్ మన్మోహన్ స్పష్టతనిచ్చారు. 2019లో ఒడిశాలో బీజేపీ 8 పార్లమెంట్, 23 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందగా.. బీజేడీ 12 పార్లమెంట్, 123 అసెంబ్లీ స్థానాల్లో గెలిచింది.

శరీరంలో ఏడాది పాటు కొవిడ్ వైరస్!

న్యూఢిల్లీ, మార్చి 8: కొవిడ్ తగ్గినప్పటికీ బాధితుల రక్తంలో వైరస్ శకలాలు(యాంటిజెన్లు) 14 నెలల పాటు ఉంటున్నాయని, కణజాలంలో దాదాపుగా రెండేండ్ల వరకు ఉంటున్నట్టు పరిశోధకులు తాజాగా గుర్తించారు. చాలామందిలో లాంగ్ కొవిడ్‌కు ఇదే కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. వ్యాధి తీవ్రత తక్కువగా ఉన్న వారి కంటే ఎక్కువున్న వారిలో, దవాఖానలో చికిత్స తీసుకున్న వారిలో వైరస్ యాంటిజెన్లు రెట్టింపు స్థాయిలో ఉంటున్నట్టు గుర్తించారు. లాంగ్ కొవిడ్‌కు, గుండెపోట్లకు ఈ వైరస్ శకలాలే కారణమా అనేది కచ్చితంగా నిర్ధారించేందుకు మరింత లోతుగా పరిశోధన చేయాల్సి ఉందని పరిశోధకుడు మైఖేల్ పెలుసో పేర్కొన్నారు.

నమాజ్ చేస్తున్న వారిపై పోలీస్ దాడి

న్యూఢిల్లీ: రద్దీగా ఉండే రహదారిపై ప్రార్థనలు చేస్తున్న ఓ గుంపును చెదరగొట్టటంలో ఢిల్లీ పోలీస